



ఆర్ఎ వాసు, ఎ.నాగరాజు చిత్రపటాలకు నివాళ్లులర్పిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన

- ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యుల అసోసియేషన్



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న వైద్యులు(ఫైల్)

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సమస్యలను పరిష్కరించేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని ఎపి పిహెచ్‌సి వైద్యులు చెబుతున్నారు. గత కొంత కాలంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పలు రకాల ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. చివరకు అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రినికలిశారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని చర్చించారు. రాతపూర్వక వివరణ ఇస్తే ఆలోచిస్తామని నాయకులు చెప్పారు. గత కొంత కాలంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి సమ్మెపై డిమాండ్స్ వినతిపత్రాల రూపంలో తెలిపారు. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ప్రధాన డిమాండ్లు : ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలి. టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలి. నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు చేయాలి. చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5000 అలవెన్స్ ఇవ్వాలి. నేటివిటీ అండ్ అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్ చేశారు. అదనంగా తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలు పిహెచ్‌సి వైద్యులకు ఖచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలి. వైద్యుల జాబ్ చార్ట్ ఇవ్వాలి. విషపూరితమైన (toxic) పని వాతావరణాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి, అనధికారిక వ్యక్తులు (ఉదా: నాన్ మెడికల్, శాఖకు సంబంధం లేనివారు) పిహెచ్‌సిలను విచ్చలవిడిగా ఎన్‌స్పెక్షన్ చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి. తగినంత స్టాఫ్ నర్సులు లేకపోయినా పిహెచ్‌సిలను తాము నడిపిస్తున్న కఠిన పరిస్థితులను ప్రభుత్వం గమనించాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు ఎన్నిసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిష్కారం కాలేదు. దీంతో మేము నిరసనకు దిగక తప్పని పరిస్థితి ఏర్పడింది అని తెలిపారు.

మా నిరసన ప్రజలపై కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాత్రమే అని గమనించాలన్నారు. కరోనా వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రజా సేవలో వెనుకడుగు వేయలేదన్నారు. అయినప్పటికీ, మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం మరుగునపరుస్తూనే ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి



సర్వీస్‌లో జాయిన్ అయ్యే ముందు చెప్పిన విధంగా సర్వీస్ కోటాను ఇవ్వాలి. గత సంవత్సరం హామీ ఇచ్చిన విధంగా 20శాతం సర్వీస్ కొటాను అమలు చేయాలి. టైం బాండ్ ప్రమోషన్స్ అమలు జరపాలి. ట్రైబల్ అలవెన్సును 30శాతం ఇవ్వాలి. నోషనల్ ఎగ్రిమెంట్స్ ఇవ్వాలి. ఈ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 26న మా ఆందోళనను ప్రారంభించాం. సెప్టెంబర్ 26వ తారీకు ఆన్లైన్ సర్వీస్ లను బంద్ చేసి, సెప్టెంబర్ 30 నుంచి పిహెచ్‌సిలలో ఓపి వైద్య సేవలను, ఈనెల ఒకటి నుంచి ఎమర్జెన్సీ వైద్య సేవలను కూడా బంద్ చేశాం. ఈనెల 4నుంచి విజయవాడలో ఆమరణ నిరాహార దీక్షకు పునుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మాన్యాయమైన డిమాండ్స్‌ను నెరవేర్చాలి. ప్రజలు మా ఆందోళనకు సహకారం అందించాలి. మా డిమాండ్స్ నెరవేర్చే వరకు మా ఆందోళనలు కొనసాగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

- రఘురామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు, ఎపిపిహెచ్‌సి డిఎస్

మట్టి పాటల పరిమళం ఆర్ఎ వాసు

- పిఎన్ఎం ఆధ్వర్యంలో ఆర్ఎ వాసు వర్ధంతి సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మట్టి పాటల పరిమళం ఆర్ఎ వాసు అని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రజానాట్యమండలి గైడు ఎండి ఆనంద్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో ఆర్ఎ.వాసు, ఎ.నాగరాజు వర్ధంతి సభ పాటకు పట్టాభిషేకం పద్యాలాపన నిర్వహించారు. ముందుగా పిఎన్ఎం నాయకులు లోకేష్ స్వాగతం పలికారు. ఈ సభకు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎంపీ బసవరాజు అధ్యక్షత వహించారు. ముందుగా ఆర్ఎ వాసు, ఎ.నాగరాజు చిత్రపటాలకు ఎండి ఆనందబాబు, పిఎస్. రాధాకృష్ణ, జంధ్యాల రఘుబాబు, పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎండి.ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఒక కవి ఇలా అన్నాడు. ప్రజా పక్షం వహిస్తే సమాజానికి ఎంతో ఉపయోగమని, నేడు కొంతమంది కళాకారులు ప్రసార సాధనాలను దుర్వినియోగం పరుస్తున్నారని చెప్పారు. వాసు, నాగరాజు ప్రజల వైపు నిలిచి ప్రజల కష్టాలను కళ్లారా చూసి తన కలం ద్వారా పాటలు రచించి పాడినటువంటి గొప్ప రచయితలు, గాయకులు, కళాకారులు అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలను దేశ, రాష్ట్ర రాజకీయ నాయకుల పనితీరును అద్దం పట్టే విధంగా కవులు, రచనలను పాటలను రాసి ప్రజలకు కనువిప్పు కలగజేయాలని కోరారు. పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ మట్టిలో పుట్టిన ఆణిముత్యాలని వారని కొనియాడారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు వారిరువుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కళాకారులు వాసు రాసిన పాటలతో పాటకు పట్టాభిషేకం రంగస్థల కళాకారులు పద్యాలపన నిర్వహించారు. ప్రజా పాటల రచయితలు జంధ్యాల రఘుబాబు, ఎలమర్తి రమణయ్య, డి పార్వతయ్యలను శాలువా మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆర్ఎ. సుజాత, నోమేశ్వరి (చిట్టి) నాగ సుంకన్న, బాలు, బతుకన్న, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, ఆశన్న, సరితలు వాసు రచించిన పాటలను పాడి వినిపించారు. రంగస్థల కళాకారులు రమణారెడ్డి, రాజశేఖర్, హనుమాన్ కళా సమితి అధ్యక్షులు హనుమంతరాయ చౌదరి, టిజి. వెంకటేశ్వర్లు, ధనుంజయ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇ.రాజు పద్యాలాపన కార్యక్రమం వర్ధంతి సభ వందన సమర్పణతో సభ ముగిసింది.

ఎపిపి రాత పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకానికి ఈనెల 5న రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాత పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కర్నూలు జిల్లాలో ఆదివారం కర్నూలు జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు జిల్లాలలో పరీక్ష కేంద్రాలను కేటాయించిందన్నారు. ఈరాత పరీక్ష ప్రశాంత వాతవారణంలో కొనసాగుతుందన్నారు. కర్నూలు పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 381 అభ్యర్థులకుగాను 261 మంది హాజరయ్యారని, 120 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు రెండు విడతల్లో నిర్వహించడంలో భాగంగా పేపర్-1 ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నారన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా ఎస్‌పి వెంట అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, కర్నూలు తాలుకా సిఐ తేజమూర్తి ఉన్నారు.



పరీక్ష నిర్వహకులతో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

మోడీ పర్యటనపై కసరత్తు

- ఓర్వకల్, కర్నూల్‌లో బహిరంగ సభ
- కర్నూల్‌లో రోడ్ షో
- 16న ప్రధాని మోడీ పర్యటన ఖరారు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కర్నూలు జిల్లాలో పర్యటన ఈనెల 16న అలాగా ఖరారు అయింది. ఇప్పటికే మోడీ పర్యటన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఓర్వకలు కర్నూలు నగరంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించనున్నారు. కర్నూలులో పెద్ద ఎత్తున రోడ్డు షో కార్యక్రమంలో పాల్గొననున్నారు. కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఈ నేల16న జరుగనున్నది. ఈ పర్యటనలో ప్రధాని మోడీ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సందర్శించి, జిఎస్‌టి (వస్తు, సేవల పన్ను) సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రోడ్‌షో నిర్వహించ నున్నారు. ఆ సమయంలో ప్రధానమంత్రి మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇతర మంత్రి, ఎమ్మెల్యేలతో కలిసి భారీ ర్యాలీలో పాల్గొన నున్నారు. ప్రధాని పర్యటనలో శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం అక్కడి నుండి ఓర్వకల్లుకు చేరుకుంటారు. ఓర్వకల్లు పారిశ్రామిక వాడ సమీపంలో ఉన్న జయరాజ్ స్టీల్ ఫ్యాక్టరీని ప్రారంభించిన అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన ప్రజావేదిక బహిరంగ సభలో మోడీ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా మోడీ పర్యటనల్లో రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమ, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉన్నాయని సమాచారం. అనంతరం సాయంత్రం కర్నూలు నగరంలో భారీ రోడ్ షో కార్యక్రమంలో పాల్గొంటారు. రైతు బజార్ సర్కిల్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు రోడ్డు షో జరగనుంది. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో కూడా ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగిస్తారని సమాచారం. అక్కడి నుండి నేరుగా కర్నూలు నగరంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకొని అక్కడే బస్సు చేస్తారు. ప్రధాని మోడీ పర్యటన ఖరారు కావడంతో కర్నూలు నగరంలోని రహదారులన్నిటిని మరమ్మతులు నిర్వహించేందుకు కూడా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి మోడీ పర్యటనకు రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్‌గా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

సుందరీకరణ పేరుతో ప్రజాధనం వృధా

- బాగున్న రోడ్లను తవ్వి ఊరి బయట వేయడం - ఊరి బయట నుండి తెచ్చిన ఇసుక, కంకరతో గుంతలు పూడ్చడం
- నగర పాలక సంస్థ ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కాలుష్య నివారణ, నగరంలో సుందరీ కరణ పేరుతో రోడ్లను తవ్వి ఆ మట్టిని ఊరి బయట పడేసి అక్కడి నుండి తెచ్చిన ఇసుక కంకరతో రోడ్ల గుంతలను పూడస్తూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్.సుధాకర్, ఎ.వెంకటేశ్వర్లు, మహమ్మద్ యూనూస్, ఎస్.రమణ గౌడ్ విమర్శించారు. ఆదివారం పట్టణ పౌరసంక్షేమ సంఘం ప్రతినిధి బృందం నగరంలో నిర్మిస్తున్న రోడ్డు డివైడర్లను అందులో వేసిన మట్టిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ నగరంలో ప్రధాన రోడ్ల మధ్య ఉన్న సిమెంటు దిమ్మెలను తొలగించడం, అవసరానికి మించి రోడ్లను తవ్వి ఊరి బయట పడేస్తూ అక్కడినుండి తెచ్చిన ఇసుక కంకరతో ఆగుంతలను సిమెంటుతో మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. పన్నుల ద్వారా వస్తున్న ప్రజల కష్టార్జితాన్ని పొదుపు పొదుపుగా ఖర్చు చేయాలనే దృక్పథం నశించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు పేట నుండి ఐదు రోడ్ల కూడలి వరకు యు షేప్‌లో ఆర్‌సిసి గోడలు అవసరానికి మించి ఎత్తు నిర్మించారన్నారు. హైవే రోడ్డుపై కూడా ఇలా నిర్మించరని అన్నారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదుల హిట్‌లిస్టులో ఉండేవారెవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. నగర మేయర్, ప్రజాప్రతినిధులు స్పందించి చిత్ర విచిత్రంగా వివరిస్తూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్న ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో సివి వర్మ, ఎల్లాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నాయకులు

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్ర వర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.



మాట్లాడుతున్న జి.రామకృష్ణ

కల్లూరు మండలానికి సాగునీరు అందివ్వాలి

- చిన్న రాయని తిప్ప రిజర్వాయర్కు నీళ్లు నింపాలి
- ఎపి రైతు సంఘం కల్లూరు మండలం మహాసభ డిమాండ్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలంలో సాగునీరు అందించాలని చిన్నరాయని తిప్ప రిజర్వాయర్ను పూర్తిగా నీటితో నింపి పంట కాలువలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉల్లెందకొండలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మహేశ్వరులు అధ్యక్షతన జరిగిన మండల మహాసభకు ముఖ్య అతిథిగా జి రామకృష్ణ హాజరై మాట్లాడారు. కల్లూరు మండలంలో సాగునీటి అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాల వైఫల్యం వల్ల భూములన్నింటికీ నీరు అందడం లేదని విమర్శించారు. చిన్నరాయనితిప్ప రిజర్వాయర్ వల్ల 11 గ్రామాలకు నీరు అందించే అవకాశం ఉందని, పంట కాలువలు లేకపోవడం రెగ్యులర్‌గా రిజర్వాయర్‌ను నింపకపోవడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. హంద్రీనది, హంద్రీనీవా వల్ల మరికొన్ని గ్రామాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందని, పాలకులు పట్టించుకోకపోవడం వలన కల్లూరు మండలం కరువు బారిన పడుతుందని అన్నారు. పాలకుల పుణ్యామా అని వేసిన పంటలకు ధరలు లేకపోవడం, ఎరువులు పురుగుమందుల ధరలు పెరగడం ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం పైన 50 శాతం పెంచి ధర ఇస్తామని వాగ్దానం చేసి ఎన్నికల అనంతరం మొండి చేయి చూపిందని, రైతులను మోసం చేసిందనిఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20000 ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వాటాతో కలిపి ఇప్పుడు ఇస్తానని చెప్పడం అందరికీ ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు అవసరమైన యూరియా అంధక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాలలో రైతుల భూములను బలవంతంగా తీసుకొని రైతులను బికార్లుగా చేసే కుట్రలు పన్నుతుందన్నారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతులందరూ ఐక్యంగా పోరాడాలని కోరారు. గిట్టుబాటు ధర ఎరువులు, పుగుమందులు నకిలీ విత్తనాలు తదితర రైతాంగ సమస్యలపై రాజకీయాలతో సంబంధం లేకుండా రైతులందరూ ఐక్యం కావాలన్నారు. మండల కార్యదర్శి ఎ.కృష్ణ మాట్లాడుతూ గతంలో రైతు సంఘం ఆధ్వర్యంలో చేసిన కృషిని వివరించారు. భవిష్యత్తులో నూతనంగా ఏర్పడిన కమిటీకి రైతులందరూ రైతు ఉద్యమాన్ని నిర్మించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మస్తాను, శేఖర్ సుధాకర్, విశ్వేశ్వరయ్య, నాగ శేషులు , పలువురు రైతులు పాల్గొన్నారు.

ల్యాక్రోస్ చాంపియన్ షిప్ పోటీలు విజయవంతం

- ఒలంపిక్స్‌లో ప్రతిభ చాటాలి : డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సీనియర్ ల్యాక్రోస్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒలంపిక్స్‌లో చక్కటి ప్రతిభను చాటాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు.. కర్నూలులో మొదటి సౌత్ జోన్ సీనియర్ నేషనల్ ల్యాక్రోస్ చాంపియన్ షిప్ శని, ఆదివారాలు రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలను ఘనంగా ముగిశాయి. కర్నూలు ఆదర్శ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈపోటీలను డాక్టర్ శంకర్ శర్మ, సౌత్ జోన్ రీజియన్ హోం గార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈపోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మరో నాలుగు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ ల్యాక్రోస్ క్రీడ ఎంతో ప్రాచీనమైనదని, 11వ శతాబ్దంలో అమెరికా దేశస్తులు ల్యాక్రోస్ క్రీడను ఆడేవారన్నారు. ల్యాక్రోస్ క్రీడ భారతదేశం లో నూతనంగా వచ్చిందని దీనిలో క్రీడాకారులు రాణించాలని సూచించారు. 2028 సంవత్సరంలో జరిగే ఒలింపిక్స్ గేమ్స్‌లో ల్యాక్రోస్ క్రీడను ఎంపిక చేశారన్నారు. ల్యాక్రోస్ ఒలింపిక్స్ గేమ్స్‌లో భారతీయ క్రీడాకారులు పతకాలు సాధించాలని శంకర్‌శర్మ కోరారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అందువల్ల 25 సంవత్సరాల నుంచి విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సాహం ఇస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌బాష, రామకృష్ణారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతాప్, శివారెడ్డి క్రీడా ప్రతినిధులు క్రీడాకారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలయిన క్రీడాకారులకు డాక్టర్ శంకర్ శర్మ బహుమతులు అందజేశారు. 25 సంవత్సరాల నుంచి విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సాహం ఇస్తున్నానని తెలిపారు. ముగింపు డిఎస్‌పి మహబూబ్ బాష, క్రీడా ప్రతినిధులు , క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

మద్యం ఏరులై పారుతుంది

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం : ఐద్వా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఎరులై పారిస్తుందని అఖిల భారత ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు విమర్శించారు. ఆదివారం కొత్త బస్టాండు దగ్గరకార్మిక కర్షక భవన్‌లో కర్నూలు మండలం మహిళా సంఘం జనరల్ బాడీ సమావేశం మండల నాయకురాలు రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఎన్. అలివేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి మద్యం ఎరులై పారుతుందని విమర్శించారు. ప్రధాన రహదారులు బడులు, గుడులు తేడా లేకుండా అమ్ముతున్న ప్రభుత్వం కళ్ళు లేనట్లు వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అక్రమ బెల్ట్ షాపులు కర్నూలు మండలంలో విపరీతంగా పెరిగాయని అన్నారు. వాటిపై ఎక్సైజ్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్ల గృహహింస మహిళలపై దాడులు దౌర్జన్యాలు హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలుగు తుందన్నారు. ఈ నిర్లక్ష్యం అలాగే కొనసాగితే భవిష్యత్తులో తిరుగుబాటు తప్పదని హెచ్చరించింది. అలాగే సమావేశంలో మండలంలో మంచినీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు లాంటి అనేక సమస్యలపై పోరాటం చేయడానికి తీర్మానం చేశారు. అనంతరం కర్నూలు మండలం మహిళా సంఘం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా రమిజాబి, నాగేశ్వరమ్మ, అధ్యక్షురాలు రేణుకతోపాటు ఉపాధ్యక్షురాలుగా పద్మ, భారతి సహాయ కార్యదర్శులుగా శ్యామల, సాలమ్మ వీరితో పాటు మరో పదిమందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు.



మాట్లాడుతున్న ఎన్.అలివేలు

లెక్చరర్స్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సెల్ ఇండియా గ్లోబల్ సంస్థ , యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్ వారు ఒకేషనల్ కళాశాలకు చెందిన లెక్చరర్ స్కూల్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. కర్నూలు లోని సెంట్రల్ లైబ్రరీ సమావేశం హాలులో నిర్వహించిన కార్యక్రమం లో 'లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు' లను ప్రదానం చేశారు. నేషనల్ హుమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, గ్లోబల్ సంస్థ అల్ ఇండియా నేషనల్ జనరల్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ , రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు, రిటైర్డ్ ఎఎస్‌పి వెంకన్న చౌదరి, డిఎస్‌పి మహబూబ్ బాష , ప్రముఖ పారిశ్రామికవేత్త టిజి. శివరాజ్, డాక్టర్ శంకర్ శర్మ, కె.జి. గంగాధర రెడ్డి, లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా లెక్చరర్లు అవార్డును అందుకున్నారు.



లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు

జూనియర్ లెక్చరర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ వైవి.రామకృష్ణ , జూనియర్ లెక్చరర్ ఇన్ కామర్స్ ఎన్. విజయ శేఖర్ అనుకోవడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నాగ స్వామి నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ స్వరూప్ సిన్హాకు జీవిత సాఫల్య పురస్కారం

కర్నూలు కార్పొరేషన్ : డాక్టర్ స్వరూప్ సిన్హాకు జీవిత సాఫల్య పురస్కారం ఆదివారం కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ జీవిత సాఫల్య పురస్కారం, డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, బెస్ట్ లాంగ్వేజ్ ఫెసిలిటేటర్‌గా మొత్తం మూడు పురస్కారాలను అందుకున్నారు. రాయల సీమ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ డా వెంకటబసవరావు, డిఎస్‌పి. మెహబూబ్ బాషా, డాక్టర్ శంకర శర్మ, చంద్రశేఖర కల్కూర, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఈ పురస్కారాలను డాక్టర్ స్వరూప్ సిన్హాకు, ఆయన సతీమణి వయోల సిన్హాలకు ఘనంగా సన్మానం చేసి అందించారు.



లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న స్వరూప్ సిన్హా దంపతులు



మాట్లాడుతున్న పిఎస్ రాధాకృష్ణ

అందని ద్రాక్షలా డ్రైవర్ సేవలో పథకం

- అర్హులకు రూ.30 వేలు ఇచ్చే దాకా పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఆటో డ్రైవర్లను మాకూటమి ప్రభుత్వమే ఆదుకుందని గొప్పలు చెబుకుంటున్న ముఖ్యమంత్రి ఒకసారి రాష్ట్రంలో ఎంత మంది డ్రైవర్లు ఉన్నారు. ఎన్ని వాహనాలు ఉన్నాయి. ఎంతమందికి ఇచ్చామనే రీతిలో ఆలోచించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక కర్షక భవన్లో ఆదివారం ఆటో యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన లబ్ధిదారులకు రాష్ట్రంలో ఉన్న లబ్ధిదారులకు ఎలాంటి పొంతన లేదని, ఆటో డ్రైవర్ల సేవలో పథకం విఫలమైందన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో లేకున్నా ఆటో డ్రైవర్ల మీద ప్రేమతో ఇస్తున్నానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆటో, క్యాబ్, మ్యాక్సీ, లారీ డ్రైవర్ల అందరికీ వాహన మిత్ర ఇస్తానని ఈరోజు కేవలం సగం మంది ఆటో డ్రైవర్లకు మాత్రమే ఇచ్చారన్నారు. ఆటో మీద ఆధారపడి బతుకుతున్న డ్రైవర్లకు ఎలాంటి సహాయం అందించలేదని, లారీ డ్రైవర్లను మరిచారని ప్రభుత్వం తక్షణమే లైసెన్స్ కలిగిన డ్రైవర్ల అందరికీ ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద సంవత్సరానికి రూ.30 వేల ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విజయవాడలో జరిగిన పథకం లాంచింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధిక జరిమానాల జీవో 21 సంక్షేమ బోర్డు ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తానన్న హామీని ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశపరిచి జీవోలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ జిల్లా నాయకులు శ్రీను, సుంకప్ప, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం చేయూత : టిడిపి

ప్రజాశక్తి-సి బెళగల్ : ఆటో డ్రైవర్లకు ఉపాధి కరవయిన సందర్భంగా టిడిపి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించినందుకు ఆదివారం ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ చిన్న తిమ్మప్ప, సిబెళగల్ ఎంపిటిసి ఈరన్న గౌడ్, మండల నాయకులు అమరనాథ తదితరుల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటోకు పాలాభిషేకం చేశారు. ఇక్కడే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు, డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందని టిడిపి ఆదుకోవడం గొప్ప వరమని డ్రైవర్లు అన్నారు.



డాక్టర్ అంబేద్కర్ అందరి వాడు

-విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరి వాడని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కొనియాడారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పెద్దకడబూరు మండలం కల్లుకుంటలో డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షులుగా సమర్థ వంతంగా పని చేసి మనకు దేశ పరిపాలన వ్యవస్థకు ప్రజాశికను రాజ్యాంగం ద్వారా కల్పించారన్నారు. అలాంటి మహనీయుడు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఇలాంటి మహనీయులు కొందరు వారు కాదని అందరి వారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్‌రెడ్డి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పురుషోత్తం రెడ్డి మండల అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి , ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వై బాలనాగిరెడ్డి

జటిలమౌతున్న ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలమౌతుంది నివారించాల్సిన పాలకులు అధికారులు చేతులెత్తేశారు. రోడ్డు వెడల్పు చేయిస్తామని వాహనాల రద్దీ ట్రాఫిక్ సమస్య పరిష్కారం చేస్తామని చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఆదోని పట్టణం 160 సంవత్సరాల క్రితం మున్సిపాలిటీ గా ఏర్పాటైంది. అప్పట్లో ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 25 వేల జనాభా ఉండేది. ప్రస్తుతం రెండు లక్షలకు పెరిగింది. ఆ సమయంలో ఏర్పాటు చేసిన రహదారులే ఇప్పటికే కొనసాగుతూ ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రహదారులు మాత్రం విస్తరించకపోవడంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవడమే కాకుండా అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు: ఆదోని పట్టణంలోని పెద్ద మసీదు రోడ్డు మున్సిపల్ రోడ్డు పండిట్ నెహ్రూ రోడ్డు పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఎప్పుడు వాహనాల రద్దీ ఉంటుంది. ఆ రోడ్డు వెంబడి వెళ్లేవారు నిలిచి నిలిచి వాహనాలు ముందుకు పోనిస్తూ ఇబ్బందులు పడుతూ ఉసూరుమంటున్నారు ప్రత్యామ్నాయ రోడ్డు లేకపోవడంతో బళ్లారి, సిరుగుప్ప, రాయచూరు, ఆలూరు వైపు వెళ్లే వాహనాలు పట్టణం గుండా వెళ్లాల్సి ఉంది. భారీ వాహనాలు రాకపోకలు వల్ల ఆరోడ్లు ఎప్పుడూ ట్రాఫిక్ స్తంభిస్తుంది. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు పంట ఉత్పత్తులతో వెళ్లే వాహనాలు ఆదోని పట్టణంలోనే వెళ్లాల్సి ఉంది. గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం ఆదోనికి రావడం వల్ల జనంతో కిక్కిరిసి ఉంటుంది. వాహనాల రద్దీతో ట్రాఫిక్ వల్ల పద్మవ్యూహాన్ని తలపిస్తుందని పురవాసులు వాపోతున్నారు


ఆదోని మార్కెట్ రోడ్డు ముందు రద్దీగా ఉన్న వాహనాలు

పాలకులు నిర్లక్ష్యం: ఆదోనిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం నిధులు అవసరం మాస్టర్ ప్లాన్ అమలు జరగాలంటే ప్రభుత్వాలు సహకరించాలి. ఆదోని పట్ల పాలకులు కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని సందర్భాల్లో వెల్లడైంది. సీఎం హోదాలో ఆదోనికి వచ్చిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదోనిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామని వరాలు కురిపించారు. నిధులు రూ.50 కోట్లు ఇస్తామని సభ వేదిక మీద హామీ ఇచ్చారు. అప్పట్లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు కొలతలు వేసి ప్రతిపాదన కూడా ప్రభుత్వానికి పంపారు. సకాలంలో నిధులు రాబట్టడంలో అప్పటి పాలకులు నిర్లక్ష్యం చేశారని ప్రజలు అంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రత్యేక గ్రాంటు తీసుకొని రావడానికి ఎమ్మెల్యే పార్థసారథి కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు

ఎమ్మిగనూరు : కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు పేర్కొన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం పాత ఆఫీసులో మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షులు జె.నాగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఎండి అంజిబాబు, సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు మాట్లాడుతూ కార్మిక రంగం స్వాతంత్రం కంటే ముందు బ్రిటిష్ వారితో పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2020లో కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ చట్టాలుగా మార్పులు చేసి కార్మిక హక్కులను కాలరాసిందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, నాలుగు లేబర్ కోడ్ల ద్వారా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి చేయడంతో కూటమి ప్రభుత్వం అందుకు తలూపడం సిగ్గుచేటన్నారు. కార్మికులు సమ్మె చేస్తున్న సందర్భంగా కూటమి నాయకులు సమ్మె వద్దకు వచ్చి రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికి నెరవేర్చలేదని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పిఆర్సి 50శాతం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిటైర్డ్‌మెంట్ 62ఏళ్లకు కొనసాగించాలని తదితర సమస్యలపై మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. కేసన్న, కె. ఇస్మాయిల్, రవి, బడేసావ్, దేవదాస్, విక్రమ్, మునీంద్ర, నబి రసూల్, రంగస్వామి, కె. కాజా, పల్లవి, రాజు, గోరు బాష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు

7న ఐద్వా జిల్లా మహాసభ

ప్రజాశక్తి- ఆలూరు

మహిళల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్న ఐద్వా 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి షేకున్‌బీ తెలిపారు. ఆదివారం ఆలూరులోని జ్యోతి బసు భవన్ లో గౌసియాబి అధ్యక్షతన ఐద్వా మండల సమావేశం నిర్వహించారు. షేకన్ బీ మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారం కోసం ఐద్వా రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. మహిళాలపై జరుగుతున్నా దాడులను అరికట్టాలని, మద్యపానం నిషేదించాలని, డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందేలా చూడాలని, చిన్నతరహా మహిళా వ్యాపారులకు సబ్సిడీ రుణాలను అందేలా చూడాలన్నారు. మహిళా రిజర్వేషన్ ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో కచ్చితంగా అమలు జరిగేలా చూడాలని వివిధ సమస్యలపై తీర్మానలతో ఈనెల 7న ఐద్వా జిల్లా 12వ మహాసభలు కర్నూలు నగరంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలలో మహిళలందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు భారతి, తిక్కమ్మ, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా మండల కార్యదర్శి షేకున్‌బీ

తప్పిపోయిన పిల్లలను తల్లి దండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు చెందిన చిన్న పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించి పోలీసులు వారి కడుపు కోతను తీర్చారు. ఆదివారం స్వామి వారి దర్శనార్థమై కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరికి చెందిన అన్నపూర్ణ అనంతరెడ్డి కి చెందిన కూతురు శరణ్య (2.5)స్థానిక ఎంపిటిఆర్ హోటల్ వద్ద ఏడుస్తూ కనిపించగా పోలీస్ స్టేషన్ కు తీసుకుని వెళ్లి సమాచారాన్ని వాట్సప్ గ్రూప్‌లోనూ మైకు ద్వారా ప్రకటించగా వారి తల్లి అన్నపూర్ణకు ఎస్ఐ శివాంజల్ ద్వారా అప్పగించారు. పాప తల్లి వారికి కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు.కర్ణాటక రాష్ట్రంలోని దావణగేరి జిల్లా జగలూర్ తాలూకా గౌరీపురంకు చెందిన చెందిన బాబు వయస్సు (06)తప్పిపోయి తిరుగుతుండగా గమనించిన పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వచ్చి ఆయన తల్లి సుధాతో పాటుబాబు పెదనాన్న తిప్పేషుకు పోలీసు సురేంద్ర అప్పగించారు. ఈ సందర్భంగా తల్లి ఆనందంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



దళితుల హక్కుల పరిరక్షణకు కెవిపిఎస్ నిరంతర కృషి

గోనెగండ్ల : దళిత హక్కుల పరిరక్షణ కోసం కెవిపిఎస్ నిరంతరం కృషి చేస్తుందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.తిమ్మన్న మండల అధ్యక్షులు చిన్నప్ప కాటికాపర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజా రమేష్‌లు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సోగానూరు కలుగొట్ల గ్రామాల్లో కెవిపిఎస్ జెండాను ఎగురవేశారు. వారు మాట్లాడుతూ కెవిపిఎస్ నేటికీ 27 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన... పోరాట లక్ష్యాలతో కెవిపిఎస్ సంఘం గా ఏర్పడి పనిచేస్తుందన్నారు. దళితుల పక్షాన నికరంగా నిలబడి రాజలేని పోరాటాలు చేసి ఏక సభ్య కమిషన్, జస్టిస్ పున్నయ్య కమిషన్, సిఫారసులు, స్మశానాల సమస్యలు పరిష్కారం జిఒ1235, దళిత గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు సాధించిందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మనువాదం మతోన్మాద మోడీ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేషన్ అమ్మటం, మనువాద మతం మతంతో దళితులపై దాడులు, కుల వివక్ష , అసమానతలు, అత్యాచారాలు నిత్యం కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. సోగునూరు కెవిపిఎస్ గ్రామ నాయకులు రాముడు, పాలరాజు, విజయ్ కుమార్ , భగవంతు , ప్రకాష్, , నాగప్ప , రంగన్న ,దినకర్, శాలెం రాజ కలుగొట్ల గ్రామ నాయకులు , ఎస్ మోహన్ , ఈరన్న గౌడ్ , ఎం వినోద్, ఎం.పెద్దయ్య, బసిగేరి ఈరన్న ,వీర గోవింద గౌడ్ , పురుషోత్తం గౌడ్ ఎంఎం నల్లన్న తదితరులు పాల్గొన్నారు.


కలుగొట్లలో కెవిపిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం చేయూత

- జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పుష్పవతి

ప్రజాశక్తి-నందవరం

ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పుష్పవతి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఆమె ఆదివారం ఆటో డ్రైవర్ల సమక్షంలో బస్టాండు గుండా గ్రామం చివరి దాకా భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. కూటమి అధినేతలు నరేంద్రమోడీ, చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ చిత్రపటాలకు ఆటో డ్రైవర్లు కూటమి నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. పుష్పావతి, చిన్నరాముడు, టిడిపి మండల అధ్యక్షులు ఖాసింవలి, జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల సంక్షేమం కొరకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆటో డ్రైవర్ల ఖాతాకు రూ.15వేల నగదు బదులు చేసి ఆర్థిక తోడ్పాటునందించమన్నారు. ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలుపుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. మస్తాన్,వడ్డేగోపాల్, వీరేష్, నల్లంగి మల్లికార్జున, రహిమాన్ బాష,రఫీక్, జగదీష్, డబ్బ ఈరన్న, పూలచింత శరీఫ్, ఆటో డ్రైవర్లు నాగరాజ్, సురేష్, హఫీస్, శేఖర్, మల్లి, అంజి పాల్గొన్నారు.



పాఠశాలల నిర్మాణాలు పూర్తి చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని కులమాల, చిన్నమరివీడు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాలల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్ అన్నారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాలల నిర్మాణాలను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్, గోనెగండ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్, పవన్ తేజలు మాట్లాడారు. మండలంలోని అనేక గ్రామాల్లో పాఠశాలల నిర్మాణాలను మధ్యలోనే ఆగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం 'మనబడి – మన భవిష్యత్' పేరుతో పాఠశాల రూపు రేఖలు మారుస్తున్నామని గొప్పలు చెప్పి మధ్యలోనే ఆపేసిందని విమర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఉపాధ్యాయులు విద్యార్థులకు చెట్ల కింద విద్యాబోధన చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. చెట్ల కింద బోధించడంతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అసంపూర్తిగా ఉన్న పాఠశాలల నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. లేని ఎడల విద్యార్థులను సమీకరించి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. పనులను పరిశీలించిన వారిలో ఎస్ఎఫ్ఐ గోనెగండ్ల మండల నాయకులు జిలాయి, వినయ్, ఓంకార్, శీను, అన్నమయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్

ఈ- క్రాప్ నమోదు గడువు పొడగింపు

- వ్యవసాయ అధికారిని సరిత

ప్రజాశక్తి-నందవరం



ఈ- క్రాప్ నమోదు గడువును ప్రభుత్వం పొడిగించిందని వ్యవసాయ అధికారిని సరిత తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న మండల రైతులకు ప్రభుత్వం మరొకసారి పంట నమోదు కొరకు అవకాశం కల్పించిందని తెలిపారు. పంట నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు గడువు పెంచిందని తెలిపారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తాజాగా ప్రకటన విడుదల చేశారని ఆమె చెప్పారు. ఈ నెల 25 వరకు పొడిగించారన్నారు. వర్షం వలన రైతు సేవ కేంద్రాల సిబ్బందికి ఇతర సర్వేల భారం ఉండటం వలన నమోదు ప్రక్రియ మందగించిందని తెలిపారు. దాని కారణంగా చాలామంది రైతులు తమ పంటలను నమోదు చేసుకోలేకపోయారన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మరొకసారి అవకాశం కల్పించిందని తెలిపారు. రైతులు తమ పంటల వివరాలను రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకోని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, పంటను ప్రభుత్వ కొనాలన్న ఈ - క్రాఫ్ నమోదు కచ్చితంగా చేయించాలని తెలిపారు.

దేవరగట్టు ఘటనపై న్యాయ విచారణ

ప్రజాశక్తి- ఆదోని

దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఉత్సవం పల్లకి కోసం జరిగిన కర్రల సమరంలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఆరంజ్యోతి నగర్‌లో మృతుడు చిన్నఅంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య ఈరమ్మ మాట్లాడుతూ తన భర్త ఆరోగ్యంగా ఉన్నాడని బన్నీ ఉత్సాహం చూసేందుకు వెళ్లి అక్కడ తొక్కిసలాటలో చనిపోయారని సంపాదించే వ్యక్తి లేక ఆసరా కోల్పోయామని వాపోయారు. ఆయన మాట్లాడారు ఈనెల మూడో తేదీ తెల్లవారుజామున దేవరగట్టులో ఇరు గ్రామాల జనం మధ్య జరిగిన కర్రల సమరంలో ఇద్దరు చనిపోగా అనేకమంది రక్తగాయాలు, మూగ గాయాలతో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారన్నారు. వెయ్యి మంది దాకా పోలీసులు ఉన్న ఎందుకు ఇంత రక్తపాతం జరిగిందో స్పష్టత లేదన్నారు. నిజాలు తేలాలంటే ప్రత్యేక అధికారితో న్యాయ విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు నాయకుడు నరసన్న, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకురాలు తస్లిమ ఉన్నారు.


దేవరగట్టు ఘటనలో మృతిచెందిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఢమరుకనాధంతో మార్మోగిన దేవరగట్టు

నాలుగు జట్కులకు గొలుసు తెంపిన గొరవయ్య బొల్లూరు గాది లింగ

-ఆకట్టుకున్న గొరువయ్యల ఆట గొలుసు తెంపుట

-అనాగరిక దేవదాసీల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -హోళగుంద

ఆదివారం దేవరగట్టు శ్రీ మాల మల్లేశ్వర సన్నిధి డమరుకం నాదంతో మారుమోగుంది, ఆశేష జనవాహిని మధ్య బొల్లూరు గ్రామానికి చెందిన గురవయ్య గాదిలింగ నాలుగు జట్కులకు గొలుసును తెంపారు. గొరువయ్యల ఆట గొలుసు తెంపుట కార్యక్రమాలు ఎంతగానో కట్టుకున్నట్లు భక్తులు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి కార్యక్రమాలు ప్రారంభం అవడంతో ఆలూరు నియోజకవర్గం లోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల కొంతమంది యాత్రికులు ఉదయమే దేవరగట్టుకు చేరుకుని సాంప్రదాయ బద్ధంగా దేవరగట్టులో జరుగు కార్యక్రమాలను తిలకించారు. నాలుగు జట్కులకు గొలుసు దిగడం శు భపరిణిమామని ఇక్కడ ప్రజల నమ్మకంగా విశ్వసిస్తారు. వచ్చేయడాది వర్షాలు బాగా కురిసి, పాడిపంటలు చేతికొస్తామని భావిస్తారు.

కంకణ విసర్జన:- శ్రీ మాల మల్లేశ్వర లను సింహాసన కట్ట ఎదురుగా ఉన్న కాడ సిద్ధప్ప మఠం నుండి ఎనిమిది వందల అడుగుల ఎత్తులో గల గిరి పై పూజలు అందుకుంటున్న గుహంలోకికి తీసుకెళ్లి కంకణ విసర్జన చేస్తారు. స్వామివార్లతోపాటు గొరువయ్యలు ఇతరులు కంకణ విసర్జన చేసుకుంటారు . అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలతో ఊరేగింపుగా కింద యథాస్థానమైన కాడ సిద్ధప్ప మటమునకు తీసుకొచ్చి రేపటి వరకు భక్తుల దర్శనార్థం ఉంచుతారు.

దేవదాసీల నృత్యాలు అనాగరికమే..

ప్రతి సంవత్సరం దేవరగట్టు బన్నీ ఉత్సవాలలో భాగంగా శ్రీ మాల మల్లేశ్వర సన్నిధిలో గొరవయ్యలాట గొలుసు తెంపుట కార్యక్రమం ముగిసిన తర్వాత సాయంత్రం దేవదాసీల నృత్యాలు నిర్వహిస్తారు. పూర్వం నుండి వస్తున్న ఆనవాయితీగా ఇక్కడ ప్రజలు భావిస్తే, ఇక్కడ ఈ నృత్యాలు నిర్వహించడం అనాగరికమైనని అని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పట్లో కొందరు అహంకారులు పైశాచిక ఆనందం పొందడానికి ఇలాంటి కార్యక్రమాలను ఇక్కడ ఏర్పాటు చేసుకోవడం జరిగిందే తప్ప సమాజానికి మంచి సందేహం మాత్రం ఇవ్వదని ఇక్కడ ఇంకా ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని అంటున్నారు. భవిష్యత్తులో ఇలాంటి అనాగరిక దేవదాసీల నృత్యాలు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిషేధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేవరగట్టులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పత్తికొండ డిఎస్‌పి వెంకటరామయ్య ఆధ్వర్యంలో పోలీసు లు బందోబస్తు ఏర్పాటు చేశారు.


గొరువయ్యల ఆట గొలుసు తెంపుట

రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

-రాయల చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం



అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోరారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పెద్దకడబూరు మండలంలో గల చిన్నతుంబలం గ్రామంలో ఉన్న చారిత్రాత్మక రాయల చెరువును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రైతుల పంటలకు తీవ్ర నష్టం జరిగిందని ,వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఉన్న రైతు సంఘం అధ్యక్షులు కెపి ఎల్లప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి రైతులు యూరియా కొరతతో పాటు వరదల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ నీటి సంఘాల అధ్యక్షులు లింగన్న గౌడ్, పెద్దకడబూరు మండల వైసిపి ఇంటెల్లక్టువల్స్ వింగ్ అధ్యక్షులు కె. బ్రహ్మయ్య, మాజీ హైస్కూల్ చైర్మన్ బొడ్డన్న, మదిరి రాముడు, మాజీ డీలర్ కడబూరీ, చెవుల లక్ష్మన్న, మండల వాలంటీర్స్ విభాగం అధ్యక్షులు నరసింహ ఆచారి, కురువ మల్లయ్య, సునీల్ వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

20ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎల్లి మల్లేశప్ప ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 20ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఎక్కడెక్కడో చదివి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడిన మిత్రులు ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా వారి పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి చిరు కానుకలు అందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ చిన్నప్పుడు చూసిన మిమ్మల్ని నేడు మీ కుటుంబంతో చూడడం సంతోషంగా ఉందన్నారు. అందరూ ఒక్కో రంగంలో స్థిరపడి గొప్పవారిగా కనిపిస్తుంటే మేము చెప్పిన చదువులు వృథాకాలేదన్నారు. మిత్రులు పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పలు సంఘటనలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ప్రాంగణం పూర్వ విద్యార్థుల సందడితో కళకళలాడింది. కుటుంబ సభ్యులు, పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు అటెండర్లు పాల్గొన్నారు.





ఎకరాకు రూ. 30 వేల నష్టపరిహారమివ్వాలి

- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కోసిగి

అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి, వేరుశనగ, టమోటా రైతులకు ఎకరాకు రూ. 30వేల నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి, వేరుశనగ, టమోటా పంటలను ఆయన సిఐటియు నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో అధిక వర్షాలు కురవడంతో ఈ ప్రాంతంలో పత్తి, వేరుశనగ, టమోటా, ఉల్లి పంటకు కుళ్ళ తెగుళ్ల సోకి తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన పత్తి, వేరుశనగ, టమోటా, ఉల్లి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. పై సమస్యలపై 7న మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రాముడు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, పూజారి, శ్రీనివాసులు, రైతులు గోపాల్, మారెమ్మ, నరసప్ప పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన విఎఒపై చర్యలు ఏవి?

- నామమాత్రంగా విచారణ

ప్రజాశక్తి - దేవనకొండ

మండల పరిధిలోని పి.కోటకొండ గ్రామ వెలుగు విఎఒ హుస్సేన్ వలి పొదుపు మహిళా సంఘాల స్త్రీ నిధి రుణాల రికవరీలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. ఆయన పరిధిలోని 8 మహిళా సంఘాల స్త్రీ నిధి రుణాల రికవరీలో రూ 3.28 లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు సంబంధిత అధికారుల విచారణలో తేలింది. అయితే అక్రమాలకు పాల్పడిన విఎఒపై చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్త్రీ నిధి మేనేజర్ షఫీక్, వెలుగు లీగల్ కోఆర్డినేటర్ ముర్తుజా, సీసీలు సెప్టెంబర్ 15, 16న ఆ గ్రామానికి వెళ్లి ఝాన్సీ లక్ష్మీబాయి, లలిత, కౌసల్య, జయంతి పొదుపు మహిళా సంఘాల లీడర్లను, సభ్యులను విచారించారు. వారి విచారణలో విఎఒ అక్రమాలు చేసినట్టు రుజువైంది. అదేవిధంగా డివిజన్ డిపిఎం రెహమాన్ గత నెల ఆఖరులో, ఈ నెల 4న విచారణ చేశారు. అయితే విచారణ చేస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వంలోనూ ఆయన అక్రమాలకు పాల్పడినప్పటికి నాయకుల అండదండలతో తిరిగి విధుల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. టిడిపి ప్రభుత్వంలో కూడా అక్రమాలకు పాల్పడినప్పటికీ టిడిపి నాయకులతో పైరవీలు చేస్తూ తన ఉద్యోగాన్ని కాపాడుకుంటున్నట్లు సమాచారం. సంబంధిత ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని అక్రమాలకు పాల్పడిన విఎఒపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.